# భగవంతుడే నిజమైన మిత్రుడని విశ్వసించి ఆయనను అనుసరించటానికి ప్రయత్నించండి!

భావ సంశుద్ధి కలుగుటే భక్తియగును
పుణ్యకార్యాలు చేయుటే పూజలగును
పరులకుపకారమొసగుటే తపసుయగును
మరువబోకు డిటువంటి మంచిమాట

తనదు తప్పు తాను తరచంగ సుజ్ఞాని
పరుల తప్పులెల్ల వెదకువాడు
తనను తెలియలేడు తన తప్పు తెలియడు
ఇతనికంటె మూర్ఖుడవని మేలు

ప్రేమస్వరూపులారా!

భగవంతుడందించిన అమోఘమైన వరప్రసాదమే ఈ మానవ శరీరము. దీనిని సక్రమమైన మార్గమున అనుభవించినప్పుడే జీవితము సార్థకమవుతుంది. శరీరము కర్మానుబంధీని. కర్మాచరణ నిమిత్తమై వచ్చినది ఈ శరీరము. ధర్మాచరణ నిమిత్తమై, ధర్మసాధన నిమిత్తమై అందించిన పనిముట్టు, ఈ శరీరము. అట్టి శరీరమును వక్రమార్గమున ప్రవేశపెట్టి అన్యాయ, అక్రమ, అనాచారములతో నింపి దీనిని అపవిత్రము గావించి కల్మషము చేయటము మానవత్వానికి విరుద్ధమైన మార్గము.

మానవ శరీరమును అనుభవించుటలో మూడు విధములైన పద్ధతులున్నవి. ప్రాకృతమైన ఈ జగత్తునందు లౌకికమైన భోగభాగ్యములు అనుభవించే నిమిత్తము భగవంతుడు ఈ శరీరమును ప్రసాదించినాడని భ్రమించి, దీనిని పెడమార్గము పట్టించి, చేయరాని పనులు, పోరాని చోటులలో దీనిని ప్రవేశపెట్టి అపవిత్రము గావించుకోటం ఒక పద్ధతి. యిది అధమ

sri sathyasai vachanamrutam

మార్గమునకు చెందిన మానవత్వము. కర్తవ్య నిమిత్తమై తనయొక్క కాయమును సక్రమముగా వినియోగించుకుంటూ పాలించుకుంటూ సంస్కార కార్యకర్మములను సరైనరీతిగా చూచుకుంటూ కర్తవ్యమును నిర్వర్తించుకొని పవిత్రము గావించుకోవటము, రెండవ మార్గము. తన కర్తవ్య కర్మలను నిర్వర్తించుకోటమే కాకుండా మధ్యమధ్య పరోపకార సంబంధమైన కార్యములలో ప్రవేశించటము, భగవత్సంబంధమైన చింతనము చేయటము ఈ విధముగా ఈ దేహమును సార్థకము గావించుకోటము, మూడవ మార్గము. ఇవికాక కర్తవ్యమునందే ప్రవేశించక కాయము సార్థకము గావించుకొనే నిమిత్తమై రాత్రింబవలు సేవలలో పాల్గొని, భగవచ్చింతనలో తనయొక్క కాయమును సద్వినియోగము పరచుకోటము నాలుగవ మార్గము. వీటినే అధముడు, మధ్యముడు, ఉత్తముడు, ఉత్తమోత్తముడు అనే స్థానములకు వీటిని తీసుకువచ్చారు. భగవంతుడు అనుగ్రహించిన వరప్రసాదమైన ఈ దేహమును తిరిగి భగవంతునికి అందించటములోపల పవిత్రమైనదిగాను, సార్థకమైనదిగాను, నిత్యసత్యమైనదిగాను, మాలిన్యరహితమైనదిగాను చేసుకొని తద్వారా భగవంతునికి అర్పితము గావించటము మానవుని ప్రధానమైన కర్తవ్యము.

**ఫలాపేక్ష రహితమైన, స్వార్థరహితమైన పరమప్రేమను పరమాత్మునిపై ప్రసరింప చేయటమే భక్తి**

ఇట్టి పవిత్ర సార్థక మార్గములను అనుభవింప చేయుటకు భారతీయ సంస్కృతి యందు భక్తి మార్గమునకు ప్రధానమైన స్థానము నందించారు. భక్తి అనగా కేవలము పూజలు చేయటము, వ్రతములు ఆచరించటము, క్షేత్రములకు పోవటము, దేవాలయములకు పోవటము యిత్యాది సత్కర్మలే భక్తికి చిహ్నములని భావిస్తూ వుంటారు. ఇవన్నియు కేవలము భక్తికి ప్రాథమిక సోపానములు మాత్రమేగాని యివి భక్తి అనిపించుకోవు. అట్లని వీటిని మనము వదలనక్కరలేదు. వీటిని ఆచరిస్తూ ఆనందిస్తూ యితరులకు అందిస్తూ క్రమక్రమేణా ఒక వున్నతస్థాయి అయిన భక్తిస్వరూపములో మనము ప్రవేశించాలి. భక్తి అనగా మనసును మాలిన్యము పరచుకొనక నిర్మలమైన ప్రేమతో భగవంతుని ఆరాధించటమే! ఫలాపేక్షరహితమైన, స్వార్థరహితమైన పరమప్రేమను పరమాత్మునిపై ప్రసరింపచేయటమే భక్తి. ఏదో కారణములచే ఏర్పడిన ప్రేమ భక్తి కానేరదు. కారణరహితమైన భక్తి, ప్రేమలను ఆవిర్భవింపచేసుకోవాలి. దీనినే పెంపొందింప

sri sathyasai vachanamrutam

చేసుకోవాలి. నది, సముద్రముపైన, లత, వృక్షముపైన, నక్షత్రములు ఆకాశముపైన ఏ విధముగా సహజమైన ప్రేమను కలిగియుంటాయో అదేవిధముగా మానవుని సహజమైన ప్రేమ పరమాత్మునిపైన ప్రసరించాలి. పరమాత్మునివైపు ప్రవహించాలి. ఇది కృత్రిమమైనదిగా రూపొందరాదు. ఎక్కడ పుట్టినా నది సముద్రములో చేరుటకై తాను అనేక విధములైన శ్రమకు ఓర్చుకొని అక్కడకు ప్రయాణము సల్పుతుంది. ఇది నదియొక్క సహజలక్షణము. కారణము, నదికి సముద్రము స్వస్థానము. అదేవిధముగా ఎట్టి ఫలాపేక్ష లేకుండా మానవుడు తనయందు వుండిన నిర్మలమైన ప్రేమను పరమాత్మునివైపు ప్రసరింపచేయటమే సరియైన భక్తి.

**నీవు తప్ప అన్యము నాకు అక్కరలేదని భగవంతుని ప్రార్థించినపుడు అన్నీ తానే చూచుకుంటాడు**

ఎన్నియో ఆశలను మనస్సునందుంచుకొని, కొన్ని అభీష్టములను మనసునందుంచుకొని వాటిని ఫలింపజేసుకొనే కోరికతో పరమాత్ముని ప్రార్థించటము సరైన భక్తి కానేరదు. ఇది కేవలము రజోతమోగుణములచే ప్రభావితమైన భక్తిగా రూపొందుతుంది. రావణ, కుంభకర్ణ, కంస యిత్యాది మహాభక్తులు కేవలము రజోగుణ తమోగుణ సంబంధముచేత పరమాత్ముని ప్రార్థించి మహా శక్తులను సంపాదించుకున్నారు. ప్రతిఫలాపేక్షతో పొందిన ఈ శక్తులను, తిరిగి స్వార్థ స్వప్రయోజనములనిమిత్తమై వినియోగించుకోటంచేత సాత్త్వికము అడుగంటిపోయింది. కడపటికి తమ ఆరాధ్య దైవముపైననే యుద్ధమునకు సిద్ధమయ్యారు. ఇట్టివారలకే భగవంతునిపై ప్రేమకు బదులు ద్వేషము ఏర్పడుతుంది. అభీష్టములు విఫలమాయెనా ద్వేషము ప్రారంభమవుతుంది. అభీష్టములు నెరవేరెనా అహంకారము ప్రారంభమవుతుంది. కనుకనే ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలము పరమాత్ముని నిమిత్తమై మేము ప్రార్థిస్తున్నాము అనే సత్సంకల్పము అభివృద్ధిపరచుకున్నవారే సరైన భక్తులు. అట్టి భక్తుల నిమిత్తమై భగవంతుడే వారి స్థాయికి దిగివచ్చి వారిని అనుగ్రహిస్తాడు. భగవంతుని పదే పదే వేడుకుని మనము అందుకున్న అభీష్టములచేత మన ఆధ్యాత్మిక ప్రగతి సరైన అభివృద్ధి కానేరదు. నిజమైన భక్తుల విషయంలో భగవంతుడు ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి ఏది అవసరమో తానే చూచుకుంటాడు.

**అడుగకువే ఓ మనసా! అడుగకువే ఓ మనసా!**

srisathyasaivachanamrutam

అడుగుకొలది అది అడుగున పడునని
అడుగకున్న పని వడిగా అగునని ॥అడుగకువే॥
అడుగని శబరిని ఆదరించడే
అడుగక తనకై మడుయు జటాయువు
కడకు నేగి సద్గతి కల్గించడే ॥అడుగకువే॥

అడిగిన దశరథునకుకూడను అంత్యకాలములో యింత నీరు విడచలేదు, రామచంద్రుడు. అడగని జటాయువునకు అంత్య కర్మలంతా ఆచరించాడు, రామచంద్రుడు. అడగవలసినది ఒక్కటే! నీవు తప్ప నాకు అన్యము అక్కరలేదని కోరికను కోరినప్పుడు అన్నీ తానే చూచుకుంటాడు.

కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి పుష్పములకై ప్రీతి యేల
అడిగిన పాలిచ్చు కామధేనువే లభింప
ధనమిచ్చి ఆవును కొనగనేల
మండెడు కాంతితో మేరు పర్వతముండ
వెండి బంగారుకై వెతకనేల
భక్తి శక్తి ముక్తుల నిచ్చెడి పరమాత్మయే వుండ
పాడు సంసారంబు కోరనేల

తనను పొందితే అన్నీ పొందినట్టే! తన ప్రేమకు పాత్రుడౌతే జగత్తును సాధించినవాడే! ఆశకు దాసుడైన జగమంతటికిన్ తాను దాసుడే కదా! ఆశను జయించినవానికి జగత్తే దాసుడౌతుంది. యిక్కడ భగవంతుడు భక్తునికి ఏ రీతిగా అందజేస్తాడు, అతనిని ఆదరిస్తాడు, అక్కున చేర్చుకుంటాడు? సస్యములు తమ ప్రాణాధారమైన జలము నిమిత్తమై ఆకసమువైపు చూస్తూ, నిరాశకు గురై వుంటాయి. అట్టి సస్యములయొక్క ప్రార్థనలు అంగీకరించి మేఘములే క్రిందికి దిగి వర్షము నందించి వాటిని పోషిస్తాయి. ఊయలలో వుండిన చంటిబిడ్డ తల్లివడిలో చేరటానికి ఆశించే సమయములో ఆ ఊయలలో వున్న బిడ్డ ఎగిరి తల్లి వడిలో పడలేదు. ఆ శక్తి తనకు లేదు. కనుకనే తల్లి ఊయలదగ్గరకు వచ్చి వంగి ఆ బిడ్డను తన ఒడిలో కూర్చో బెట్టుకుంటుంది.

sri sathyasai vachanamrutam

అదేవిధముగానే తన నిమిత్తమై ప్రార్థన చేసే భక్తునివద్దకు తానే దిగివచ్చి అతనిని అనుగ్రహిస్తాడు.

**క్షేత్ర క్షేత్రజ్ఞులయొక్క రహస్యాన్ని ఎవరు గుర్తిస్తారో వారే అమృతపుత్రుడు**

ఈ ప్రార్థనలు ప్రేమ ప్రధానమైనవే! ప్రేమ నామమునుండియే పుట్టినది. నామము, ప్రేమకు తల్లివంటిది. నామమునుండి ప్రేమ పుట్టి, ప్రేమనుండి పరమాత్ముడు ఉద్భవిస్తున్నాడు. కనుక, పరమాత్మ తత్త్వమునకు ప్రేమ ఆధారము. ప్రేమకు, నామము ఆధారము. నామమునకు, భావము ఆధారము. ఈ అన్నింటికి యిచ్ఛాశక్తి అత్యవసరము. ప్రతి ఒక్కదానికి మనము వేరు వేరుగా ప్రయత్నించనక్కర లేదు. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః.' 'నాయనా! నీవు నా అంశమే, నీవు ప్రపంచముయొక్క అంశము కాదు. పంచభూతములయొక్క అంశము కాదు. నా అంశము' అని భగవంతుడు చెప్పిన వాక్యమును నీవు ఎంతవరకు విశ్వసిస్తున్నావు? ఈనాడు జనులు యాంత్రికంగా పదములను వుచ్చరించుచున్నారేగాని, పదములయొక్క భావమును ఆచరణలో అనుభూతిని అందుకోటానికి ప్రయత్నించటం లేదు. 'అమృతస్యపుత్రః ' అనింది, ఉపనిషత్తు. 'నాయనా! నీవు అమృత పుత్రుడవు, అనృత పుత్రుడవు కాదు. నీవు చిన్మయ పుత్రుడవేగాని కేవలము మృణ్మయ పుత్రుడవుగాదు,' అని బోధిస్తున్నాయి వేదోపనిషత్తులు. ఇట్టి సత్యాన్ని గుర్తించలేక కేవలము పదములు మాత్రము వల్లిస్తూ వుంటున్నాము. 'అమృతస్యపుత్రః' అంటే ఏమిటి దీని అర్థము? ఎప్పుడు అమృతపుత్రుడౌతాడు? క్షేత్రక్షేత్రజ్ఞులయొక్క రహస్యాన్ని ఎవడు గుర్తిస్తాడో వాడే అమృతపుత్రుడు.

దేహము క్షేత్రము. ఈ దేహమును గురించి మనము చక్కగా విచారించాలి. మలమూత్ర దుర్గంధ మాంస రక్తములేగాని యిందులో ఏ మాత్రము సరైన మంచి పదార్థములు లేవు.

**పొట్ట చూచిన మలమూత్ర తొట్టె సుమ్మి**
**దేహమంతయు దుర్గంధ దిబ్బ సుమ్మి**
**ఆత్మకీ దేహము అది ఒక వింత అద్దెకొంప**

ఆత్మకు ఈ దేహము వింత అద్దెకొంప. కనుకనే దీనిని

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాత సం**

sri sathyasai vachanamrutam

**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బుల పొది లెమ్ము చూడ మనమెప్పు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరి పాదము లాశ్రయింపవే!**

అన్నారు. ఈ దేహాన్ని మనము చక్కగా విచారణ చేస్తే ఈ శరీరాన్ని మనము చక్కగా విచారణ చేస్తే ఈ దేహముపైన ఏ విధమైన భ్రమలేకుండా ఒక రోత పుడుతుంది.

**నిముష నిముషంబునకు నీచులూరునెగాని**
**పునుగు జవ్వాదీలు పుట్టబోవు**

ఐతే ఈ దేహమును మనము అలక్ష్యము చేయకూడదు. ధర్మాచరణ నిమిత్తమై అందించబడిన పనిముట్టు. కనుక, ఈ పనిముట్టుకు తగిన భద్రతను మనము చూచుకోవాలి. ఐతే దేహ స్వభావాన్ని గుర్తించటము అత్యవసరము. కనుక దేహముయొక్క రహస్యాన్ని, దేహముయొక్క పవిత్రతను మనము విచారించటము యిదే క్షేత్రముయొక్క విచారణ. క్షేత్రజ్ఞుడు తానే ఆత్మ స్వరూపుడు. దేహము మృణ్మయము, క్షేత్రజ్ఞుడు చిన్మయము. కనుకనే ఈ మృణ్మయమైన దేహములో చిన్మయమైన పరమాత్మ వుంటున్నాడు.

**విలువలేని యినుపపెట్టి యీ దేహంబు**
**పెట్టెలోన నగలు పెట్టినట్లు**
**దేహమందు ఆత్మదేవుడుండెను సుమీ**

వజ్ర వైడూర్య మరకత మాణిక్య పుష్యరాగాలతో కూడిన మన విలువైన నగలను ఎక్కడ దాచి పెడుతున్నాం? బంగారు పెట్టెలో పెడుతున్నామా? కాదు, యినుపపెట్టెలో పెడుతున్నాము. కారణము, పెట్టెకు విలువ లేదు; కానీ, దానిలో వున్న నగలకు విలువ వుంటుందాది. అదేవిధముగానే దేహము ఒక యినుపపెట్టె వంటిది. దీనికంతా dust పడుతుంటాది. Rust పడుతుంది. Burst అవుతుంటాది. Rest యిస్తూ వుంటాము. దీనికే ఈ వ్యాధులంతా! కానీ, అందులో పెట్టిన విలువైన నగలు వున్నాయి. అవే సత్ చిత్ ఆనందము.

**ప్రపంచమును ప్రేమించలేనివాడు పరమాత్ముని ప్రేమించలేడు**

sri sathyasai vahinamrutam

అట్టి సత్ చిత్ ఆనందమును గుర్తించే నిమిత్తమై దేహమును మనము ప్రేమించాలి. ఆ ప్రేమ కేవలము స్వార్థమైనది కాకుండా, స్వప్రయోజనమైనది కాకుండా విశాలమైనదిగా వుంటుండాలి. భగవంతుని ప్రేమించటానికి పూర్వము తనను తాను ప్రేమించుకోవాలి. తనను తాను ప్రేమించుకున్న తరువాత సమాజాన్ని ప్రేమించాలి. తరువాత ఈ జగత్తునే ప్రేమించాలి. స్వార్థ రహితమైన ప్రేమ లేకుండా వుండినప్పుడు జగత్తును మనము ప్రేమించలేము. ప్రపంచమును ప్రేమించలేనివాడు పరమాత్ముని ప్రేమించలేడు. మొట్టమొదట జగత్తును ప్రేమించు, తదుపరి జగదీశ్వరుని ప్రేమించవచ్చు. కనుక, తనను తన సమాజమును తన తోటివారలను ప్రేమించటానికి మానవుడు ప్రయత్నించాలి. ప్రేమ వున్నచోట ద్వేషము వుండదు. ద్వేషములేనిచోట ప్రేమయే వుంటుండాది. వున్నవి రెండే! ప్రేమ, ద్వేషము. ద్వేషము అహంకారమును పెంచుతుంది. ఆడంబరమును పెంచుతుంది. ప్రేమ సహనాన్ని పెంచుతుంది. సానుభూతిని చూపుతుంది. భగవత్ సృష్టిలోపల ప్రేమ చాలా గొప్పది, ఆశ్చర్యమైనది. దీనిని విశ్వవ్యాప్తి గావించే నిమిత్తమై, ఈ ప్రేమను పరులకు అంతా సరియైన రీతిలో అందిచ్చే నిమిత్తమై, దీనిని ఒక కటుంబపరంగా పోషించుకుంటూ వచ్చారు. మానవుడు పుట్టిన తక్షణమే తన ఆకలి, తన నిద్ర, తన బాధను మాత్రమే తాను గుర్తిస్తాడు. ఇది అందరికి తెలిసిన విషయమే! పుట్టిన బిడ్డ తన నిద్ర, తన ఆకలి, తనయొక్క బాధ తప్ప అన్యము ఏమాత్రము యెరుగదు. ఆకలైతే ఏడుస్తుంది. పాలుత్రాగుతే నిద్ర పోతుంది. ఇది పెరుగుతూ పెరుగుతూ అమ్మతో సంబంధము గావించుకుంటుంది. తననుండి తల్లివరకు ప్రవేశిస్తుంది. తదుపరి ఇది పెరుగుతూ పెరుగుతూ తల్లినుంచి అక్క, అన్న, తండ్రి ఈ ముగ్గురిపైన ప్రేమను ప్రసరిస్తుంది. ఇంకా కొంత పెరుగుతూ పెరుగుతూ తన సహచరులపైన, స్నేహితులపైన ప్రేమను ప్రసరింపచేస్తుంది. ఇంక పూర్తిగా పెరిగిన తరువాత పెండ్లి అవుతుంది. ఈ పెండ్లి అయిన తరువాత కుటుంబముపైనకూడను ఈ ప్రేమ ప్రసరిస్తుంది. యితర బంధువులు మొదలగువారితో ప్రేమను పెంచుకుంటాడు. తదుపరి తనకు కుమారులు కలుగుతారు. ఆ కుమారులకు పెండ్లయిన తరువాత కొత్త కుటుంబముపైన ప్రేమ పెరుగుతూ పోతుంది. చూచారా! కేవలము స్వార్థముతో ప్రారంభమైన ప్రేమ ఎంత విశాలముగా పెరుగుతూ పోతున్నాది! ఈ విధముగా ప్రేమను పెంచుకునే నిమిత్తము భగవంతుడు మనకు సంసారము ప్రసాదించాడేగాని స్వార్థ

స్వప్రయోజనములతో కూపస్థ మండూకమువలె అందులో పడివుండటంకోసం కాదు, మానవునికి జీవితము ప్రసాదించి వుండేది.

**ప్రేమతత్త్వమును విశాలము గావించుకోవటానికి మార్గము నామస్మరణయే!**

ఈ ప్రేమ పెరుగుకొలది హృదయము చాలా విశాలమై పోతుంది. ప్రేమ విశాలము గావిస్తుంది, హృదయాన్ని. మన సంస్కారాన్ని ఇనుమడింపచేస్తుంది, ప్రేమ. ఇతరులయెడ సానుభూతి చూపుతుంది, ప్రేమ. పరుల బాధను చూచి తాను కూడా బాధపడతాడు. ఇలాంటి హృదయ విశాలతను పెంచుకొనే నిమిత్తమై 'భక్తి' అనే శక్తి స్వరూపమును మనకు అందించారు. కనుకనే మానవత్వములో భక్తి అనేది ప్రధానమైన ప్రాణమువంటిది.

**భక్తిరేవ పరమార్థదాయిని భక్తిరేవ భవరోగనాశిని**
**భక్తిరేవ పరవేదన ప్రదాయిని భక్తిరేవ మోక్ష ప్రదాయిని**

పరమార్థమైన జ్ఞానమును ప్రసాదించేది, భక్తి. భవరోగమును నాశనము చేసేది, భక్తియే! పవిత్రమైన పరతత్త్వాన్ని అందించేది, భక్తియే! మోహక్షయము గావించి భగవత్ సన్నిధి అనే మోక్షమును చేకూర్చేది భక్తియే! ఇలాంటి పవిత్రమైన భక్తిచేతనే భగవంతుని పొందటానికి ప్రయత్నించాలి. ఒక చిన్న ఉదాహరణము ఒక పంజరములో ఒక చిలుకను వుంచినప్పుడు లేక ఒక బోనులో ఒక పులిని పెట్టినప్పుడు దానిని నిత్యము మనము చూస్తూ వుంటే అంత ఆనందము మనలో ఆవిర్భవించదు. ఆ పులినే సహజమైన వనములో వదలిపెట్టి అది సహజముగా సంచరిస్తుంటే ఎంతో గంభీరమైన నడక నడుస్తుంటే మనకు ఆనందము పుట్టి పడుతుంది. ఒక పక్షిని ఎవరు చేతిలో పట్టుకున్నారో ఆ ఒక్క పక్షిపైననే వానికి ఆనందము కలుగుతుంది. యిష్టము కలుగుతుంది. పక్షిని పట్టనివానికి 'అన్ని పక్షులు నావే' అనే ఆనందము లభిస్తుంది. అనగా మానవుని ప్రేమ సహజమైన మార్గములో ప్రవేశించాలి. ఒక పంజరములో వుండినట్టుగా ప్రేమకు ఒక పరిధిని మాత్రమే నిర్ణయించరాదు. మన ప్రేమ పరిధులు దాటి ప్రసరించాలి. అదియే విశ్వప్రేమగా రూపొందుతుంది. మొట్టమొదట నామముపైన అభిరుచి కలగాలి, సమాజముపైన దయాప్రేమలు పెంచాలి. అదే విష్ణుసేవగా మారిపోతుంది. అనగా సర్వవ్యాపకమైన సేవగా మారుతుంది. ప్రేమతత్త్వాన్ని మనము విశాలము గావించుకోటానికి

sri sathyasai vachanamrutam

సరియైన మార్గము నామస్మరణయే! ఈ నామస్మరణచేత మనము మన హృదయాన్ని విశాలమైనదిగా రూపొందింపచేసుకోవాలి.

**దైవమునే కోరుకుంటే సర్వాభీష్టములు నెరవేరుతాయి**

భక్తికి మించినది ఈ జగత్తునందు మరొకటి కానరాదు. దీనిని మరొక వస్తువుతో పోల్చుటకు వీలులేదు. ఎక్కడ చూచినప్పటికి దీనిని పోల్చే పదార్థము మనకు కానరాదు. అమృతము, మధురము, మధురాతి మధురము అనుకుంటాము. కానీ ప్రేమతో పోల్చిచూస్తే అమృతమంతా చప్పిడి నీరుగా వుంటుంది. కనుక భగవత్ప్రేమ అనేది మహా పవిత్రమైనది మధురమైనది.

**వచనం మధురం శ్రవణం మధురం**
**నయనం మధురం హృదయం మధురం**
**మధురాధిపతే మధురం మధురం**

ఇలాంటి మధురమైన ఫలమును వదలి నిరంతరము మనకు బాధలనందించే ఈ ప్రాకృతమైన ఫలమును కోరుకోటం ఎంత అవివేకము! భగవంతుని ఖజానాలో, భగవంతుని ధనాగారములో ఎలాంటి విలువైన రత్నాలున్నాయో ఎవరికీ తెలియదు. అతను నీకు ఏది యివ్వాలని సంకల్పించుకుంటున్నాడో నీకు తెలియదు. అది తెలుసుకొనక ఆటబొమ్మలము మనము ఆడుకుంటున్నాము. అన్నీ అతనికే వదలిపెడితే ఏ సమయములో ఏది మనకు అనుగ్రహించాలో తానే అనుగ్రహిస్తాడు. కల్పవృక్షము దగ్గరకుపోయి కాఫీపొడిని కోరినట్టుగా మనము ఈ అల్పమైన విషయములను కోరరాదు. మానవునకు అభీష్టములు వాటంతట అవే నెరవేరుతుంటాయి. స్వామీ 'మా కష్టములు, సుఖములు, కోరికలను భగవంతునికి విన్నవించుకోకపోతే ఎట్లా తీరేది,' అని భ్రమించనక్కర లేదు. మీ మంచి, చెడ్డలు మీరు చేసే కర్మలపైనే ఆధారపడి వున్నాయి. మంచి చేస్తే మంచి ఫలితము. చెడ్డ చేస్తే చెడ్డ ఫలితము. ఇది భగవంతుని అడగనక్కర లేదు. మనము ఏది చేస్తామో దాని ఫలమే అందిస్తాడు.

**ఇది చేతు అది చేతు ఇంకెన్నియో చేతు**
**ననుచు వూహలు అల్లి అలసిపోకు**
**ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో**

srisathyasaivachanamrutam

**ఆ ఫలమ్ములె మీకు అందుచుండు**
**విత్తన మొకటైన వేరైన ఫలములు**
**సంభవించుట యెట్లు సాధ్యమగును**

**ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి**
**మంచియైన చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల**

మనము నిమ్మచెట్టు నాటి మామిడి ఫలము కావాలంటే అది మనకు లభించదు. లేక, మామిడి విత్తనము నాటి పనసపండు కావాలంటే మనకు లభించదు. దేనిని నాటుదుమో ఆ ఫలములనే మనము అనుభవించవలసి వస్తుంది. కనుక ఫలనిమిత్తమై ప్రార్థిస్తే మనము ఏమి నాటినామో, ఏమి చేశామో వాటి ఫలములే మనకు వస్తుంటాయి. ఫలములను మనము ఆశించక నిజమైన నామఫలమునే, నామరసమునే ఆశించినామంటే మనకు కోరినవన్నీ లభిస్తాయి. కనుక, దైవాన్నే మనము కోరితిమంటే సర్వమైన అభీష్టములు నెరవేరుతాయి. దైవమును కోరక దయ్యమువంటి లోకాన్ని కోరితే ఈ దయ్యమువంటి లోకము మనలను పట్టి పీడిస్తుంది, తప్పదు. కనుక, మీరు కోరవలసినది ఒక్క దైవమునే, అందుకోవలసినది ఒక్క దైవప్రేమనే, ఆచరించవలసినది ఒక్క దైవనామస్మరణే!

## ప్రాకృతమైన ప్రేమ - పరమాత్మ ప్రేమ

ఈ నామస్మరణ అనే సముద్రమును చక్కగా చిలికినప్పుడు యిందునుండియే ప్రేమ అనే ఫలము లభిస్తుంది. సకల వేద సంగ్రహమైన, సమ్మిళితమైన రసమే ఈ దివ్యమైన రసము. సకల శాస్త్రములు మథించి అందించిన సుధానిధియే ఈ ప్రేమ. లౌకిక ప్రేమలవలె ఇది క్రమక్రమేణా సన్నగిల్లిపోదు, పల్చబడదు. లౌకిక ప్రేమ దినములు గడిచేకొద్ది తరగిపోతూంటుంది. నేను అనేక పర్యాయములు మా పిల్లలకు చెప్పుతూ వుంటాను. దివ్యమైన దైవప్రేమకును అనిత్యము, అశాశ్వతము, అల్పమైన జగత్ప్రేమకును వుండిన భేదమును మనము చక్కగా గుర్తించాలి. ఆధునిక యుగమందు ఒక యువకుడు తనకిష్టమైన కన్యను పెండ్లాడినాడు.

sri sathyasai vachanamrutam

పెండ్లి అయిన తక్షణమే తన wifeయే life గా భావించుకున్నాడు. ఒక సాయంకాలము లాల్‌బాగ్, పబ్లిక్‌పార్కులో walking కోసము వెడుతున్నారు. పాపము ఎక్కడ తప్పించుకొని పోతుందో, ఈ గుంపులో ఏ విధముగా విభాగమై పోతామనో ఆమె చేయిపట్టుకొని వెడుతున్నాడు. వానికి ఇక చుట్టూ ప్రపంచమే కనిపించడం లేదు. భార్య తప్ప ఇక ఏ వస్తువు కనబడటం లేదు. అలాంటి సమయములోపల నడుస్తుంటే దారిలో ఒక ముల్లు కనిపించింది, యితని కంటికి. ముల్లు చూచిన తక్షణమే ప్రాణ సమానమైన తన భార్య ఆ ముల్లుపైన ఎక్కడ అడుగుపెడుతుందేమోనని 'ముల్లుముల్లు' అని భార్యను ప్రక్కకు లాగేశాడు. అంత అభిమానము, అంత గాఢమైన ప్రేమ. ఈ విధముగా ఆరునెలలు గడచింది. తదుపరి మరొకసారి బీచ్‌లో నడచి వెడుతున్నారు. అక్కడ కూడను ఇతడికి ముల్లే కనుపించింది, పాపం! కానీ అంత ఆతృత యితనిలో లేదు యిప్పుడు. 'అక్కడ ముల్లుంది జాగ్రత్త' అని భార్యను హెచ్చరించాడు. ఇట్లనే యింకొక ఆరునెలలు గడచింది. సంవత్సరమైన తరువాత మరొకమార్గములో ప్రయాణమై వెడుతున్నారు. అక్కడకూడను యితనికి ముల్లే కనుపించింది, పాపం! తన ప్రక్కన భార్య నడుస్తుంటే "కండ్లు కనిపించటం లేదా? ముండ్లు వున్నాయ"న్నాడు. పెండ్లి అయిన కొత్తలో ఎంత ప్రేమగా వుండినాడు? ఒక సంవత్సరము అయ్యేసరికి ఈ ప్రేమ ఎంతగా మారిపోయింది! ఇదే ప్రాకృతమైన ప్రేమకు, పరమాత్మ ప్రేమకు వుండిన వ్యత్యాసము.

**కాయముండినంతవరకు సర్వులను ప్రేమించాలి**

పరమాత్మ ప్రేమ అమృతమయమైనది. దీనికి తరగటము, పెరగటము రెండును లేవు. అదే 'పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే' అని, అదే పూర్ణమైనది. అదే పరిపూర్ణమైనది. అట్టి పరిపూర్ణ ప్రేమ నిమిత్తమై మనము ప్రాకులాడాలిగాని ఈ జగత్సంబంధమైన ప్రేమనిమిత్తమై ప్రాకులాడి మన జీవితమును దుఃఖము పాలు చేసుకోనక్కర లేదు. ఐతే మన కర్తవ్యమును మనం నిర్వర్తించాలి. కాయము వుండినంతవరకు సర్వులను ప్రేమించాలి. ఇది అందరికి సాధ్యమయ్యేది కాదు. కాదని నిరాశ చెందనక్కర లేదు. ఏదో ప్రయత్నమైనా చేస్తూ చేస్తూ వుంటే తప్పక ఆ స్థితికి మనము రాగలము. ఒక చీమ అయినా నడచటానికి యిష్టపడితే మైళ్ల దూరము నడచిపోతుంది. ఒక గ్రద్ద అయినా ఎగరటానికి

sri sathyasai vachanamrutam

ఇష్టము లేకపోతే ఒక యించైనా ముందుకు పోలేదు. కనుక మనలో వుండిన యిచ్ఛాశక్తిని అభివృద్ధి పరచుకొని దైవప్రేమను పొందుటకై, దైవసన్నిధిని వుండుటకై తగిన కృషి చెయ్యాలి. అప్పుడే మన జీవితము ధన్యమవుతుంది. మనకు అందించిన దేహము సార్థకమవుతుంది.

**త్రికరణశుద్ధియే పరమాత్ముని పొందటానికి సరియైన స్థితి**

ప్రేమస్వరూపులారా! మన కాయమును, మన కర్మలను, మన కాలమునుకూడను భగవదర్పితము గావించి సేవలో పాల్గొనాలి. మానవ సేవనే భగవత్సేవగా విశ్వసించాలి. మనము శాశ్వతమైన పెన్నిధి పొందాలి. భగవంతునికి సేవచేయటమే నిజమైన ప్రేమ. సర్వులయందుండిన తనను సేవించుటయే ప్రేమ. భగవంతుడు అందరికంటె సన్నిహితుడు. అందరికంటె సన్నిహిత మిత్రుడు. ఇలాంటి మిత్రుని పొందవలసిన మీరు తప్పించుకొని, తాత్కాలికమైన తళుకులతో బెళుకులతో చూచే మిత్రులను ఆశ్రయిస్తున్నారు. ఎవరు మీకు మిత్రులు? ఈ జగత్తులో, ఈ కాలములో, యిప్పటి పరిస్థితులలో సరైనమిత్రులు మనకు ఏమాత్రము కనిపించటము లేదు. నీ జేబులో ఏమైనా కొంత డబ్బువుందా, నీ తండ్రి మంచి అధికార స్థితి అనగా మినిష్టరుగా ఉన్నాడా, అందరూ హలో హలో అని వస్తారు. నీ జేబిలో డబ్బు లేదా నీ తండ్రి హోదా ఏనాడు కనుమరుగవుతుందో ఆనాడు నీకు ఎవ్వరూకూడ good bye కూడ చెప్పరు. చెరువులో నీరు వుండినంతవరకు వేల కప్పలు వచ్చి చేరిపోతాయి. కాని, నీరు ఎండిపోయెనా ఒక్క కప్ప అయినా అక్కడ కనిపించదు. అట్లనే ఈనాటి మిత్రులు. భగవంతుడే నిజమైన మిత్రుడు. ఆయన నీ వెంటనే జంటనే యింటనే కంటనే వుంటుండి ఏ కాలమునందైనను నిన్ను వదలక వుంటాడు. కనుక, నిజమైన మిత్రుడు భగవంతుడే అని విశ్వసించి ఆయనను అనుసరించటానికి ప్రయత్నించండి. అదియే సార్థక మార్గమునకు సరైన రాజ బాట. నామస్మరణచేత కాలము సార్థకము గావించుకోండి. పరోపకార సంబంధమైన సేవలచేత కాయమును సార్థకము గావించుకోండి. ఇతరులయొక్క మంచిని కోరి లోక కళ్యాణ నిమిత్తమై నిరంతరము 'లోకాస్సమస్తాసుఖినో భవంతు' అనే చిత్తాన్ని బలపరచుకోండి. అప్పుడే త్రికరణ శుద్ధి ఏర్పడుతుంది. ఈ త్రికరణశుద్ధియే పరమాత్ముని పొందటానికి సరియైన స్థితి. కనుక, నామాన్ని ఎక్కువగా వుచ్చరించండి. అనవసరముగా కాలమును వ్యర్థము చేయకండి.

srisathyasaivachanamrutam

కాలము భగవత్ స్వరూపము. చేతనైనంతవరకు పరులకు వుపకారము గావించే కార్యములలో ప్రవేశించండి. ఇంతకంటె నిజమైన సాధన, ఇంతకంటె పవిత్రమైన పూజ మరొక్కటి లేదు. అనంతమైన పరమాత్మను ఫోటోలు తీసుకువచ్చి దానికి ఫ్రేము కట్టి నీ పూజరూములో పెట్టి పూజించనక్కర లేదు. ఆ పరమాత్మను నీ హృదయములో పెట్టి పూజించు. ఈ బాహ్యమైన పూజలచేత ఏనాటికైనాకూడను మనకు భంగము కలుగవచ్చును.

**దేహమే దేవాలయము, హృదయమే దైవపీఠము**

మీరా పరమభక్తురాలు. ఆమెకు కృష్ణుడు తప్ప అన్యులు ఏమాత్రము జగత్తులో కనిపించలేదు. కాని, ఆమెలో ఒక భవ్యమైన ఆశ వుండేది. నా కృష్ణుని చలువరాతి కృష్ణునిగా రూపొందింపచేసుకొని దానికి ఒక చిన్న మందిరము కట్టి ఆ మందిరములో నా కృష్ణుని ప్రతిష్ఠింపచేసుకొని ఇరువది నాలుగు గంటలసేపు నా కృష్ణుని గానముచేత ఆనందింపజేసి అందులో వుంచాలని ఆశించింది. ఐతే 'ఈ మందిరము కట్టేదెవరు! ఇది నాచేత కాదే! నా ఆశ నెరవేరుతుందా? నా జన్మలో దానిని నేను అనుభవించగలనా,' అని సందేహము వస్తూ వుండేది. ఒకానొక సమయములో మహారాణా వచ్చాడు. మహారాణా మీరాను పెండ్లి చేసుకోవాలని ఆశించాడు. కానీ ఈమె పెండ్లి అంటే ఏమిటో బొమ్మలాటగా భావించి, జీవితంలో తన ముఖ్యమైన లక్ష్యమును తాను గుర్తింపచేసుకుంది. ఇతను గొప్పవాడుగా వుంటున్నాడు శ్రీమంతుడుగా వుంటున్నాడు. ఇతనిని పెండ్లి చేసుకుంటే నా అభీష్టము నెరవేరుతుందేమో, చలువరాతి మందిరము కట్టి కృష్ణుని ప్రతిష్ఠింప చేసుకొని నిరంతరము కృష్ణనామముచేత నాయొక్క జీవితము ధన్యము గావించుకోవచ్చునని భావించి ఆ ఆశతో మహారాజును పెండ్లి చేసుకుంది. ఈ ఆశకు దాసురాలైపోవటంచేత మోసములో చిక్కుకుంది. కొంతకాలము గడచిన తరువాత మహారాజు తన ఇష్టమునకు విరుద్ధముగా నడచుకోటంచేత ఆమెను మందిరమునుండి బయటకు వెళ్ళిపొమ్మన్నాడు. బయటకు వెళ్ళిపొమ్మన్న తక్షణమే ఆమెకు ఒక షాక్ మాదిరి అయింది. చాలా భయంకరమైన దుఃఖము ఏర్పడింది. తక్షణమే తనలోవున్న విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములను మేలుకొలిపింది.

"ఈ మందిరము మహారాణా కట్టినది. మహారాణా ప్రతిష్ఠ జరిపింది. ఈ మందిరము

srisathyasaivachanamrutam

అశాశ్వతమైంది. కానీ, నా హృదయ మందిరము భగవంతుని నిర్మాణము. అందులోనే భగవంతుడు ప్రతిష్టయై వుంటున్నాడు. 'మద్భక్తాః యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద' అని చెప్పినట్లు భగవంతుడు తన భక్తుడు ఎక్కడ తన్ను గురించి గానము చేస్తుంటాడో వాని హృదయ మందిరములోనే వుంటాడని తెలుసుకుంది. వెంటనే తన మనస్సును "భ్రూమధ్యస్థానమునకు నీవుపో. అక్కడా నా కృష్ణుడు వుంటున్నాడు' అని బోధించింది. 'ఓ! మనసా అటూ యిటూ నీవు పరుగెత్తనక్కర లేదు. ఎందుచూచినా నా కృష్ణుడే! నాయందున్న కృష్ణుడే నా ప్రేమ కృష్ణుడు. నా యొక్క సంపూర్ణమైన అభిమాన కృష్ణుడు' అని మనసు స్థిరపరుచుకుంది. మనము కట్టిన మందిరములు, పెట్టుకున్న మందిరములలో వున్న పటములు, విగ్రహములు శాశ్వతమైనవి కాదు. మన హృదయ మందిరములో వున్నటువంటివి శాశ్వతమైనవి. నీవు ఎక్కడకు పోయినప్పటికి నీ దేహమే దేవాలయము, నీ హృదయమే దైవపీఠము. ఆత్మయే నీయొక్క దేవతా స్వరూపము. దానిని భద్రము చేసుకొని పరిపూర్ణ సంతృప్తిగరపే నిమిత్తమై నిరంతరము నీవు నామస్మరణలో మునుగు. లోకమంతా పిచ్చి వారనుకున్నా నీవేమీ వెరువనక్కర లేదు. ఆ పిచ్చిలో వుండిన ఆనందము ఈ పిచ్చివారికి ఏమి తెలుస్తుంది? ఈ విధమైన జీవితమును గడపటములోపల మీయొక్క జన్మము సార్థకము చేసుకోండి. అనవసరముగా మీరు వాదోపవాదములు వేసుకొని జాతి, మత, కలహములు పెట్టుకొని దివ్యమైన ఈ మానవత్వము వ్యర్థము గావించుకోకండి. అందరూ భగవంతుని బిడ్డలే! అందరూ అక్కచెల్లెండ్రే! అందరియందు వున్న పదార్థము ఒక్కటే! మన తలపైనున్న ఆకాశము ఒక్కటే! మనము నివసించే భూమి ఒక్కటే! మనము పీల్చుకునే గాలి ఒక్కటే! మనము త్రాగే నీరు ఒక్కటే! ఎందుకు మనకీ కక్షలు, ఎందుకు మనకీ భేదములు? ఎందుకు మనకీ ద్వేషములు? ఈ ద్వేషములు మనకక్కరలేదు, ప్రేమను పెంచుకొని పరమాత్మను అనుగ్రహింప చేసుకొని, తద్వారా అందులో లీనము కండి.

**(తేదీ. 18-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam